క్లుప్తంగా

ఇంటి పన్ను 5 శాతం రిబేట్‌కు నేడే ఆఖరు



ఇంటి పన్ను చెల్లిస్తున్న ప్రజలు

మంచిర్యాలటౌన్: గత ఆర్థిక సంవత్సరం వరకు ఇంటి పన్ను బకాయిలు పూర్తిగా చెల్లించిన వారికి 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తు పన్ను చెల్లింపులకు గాను ప్రభుత్వం ఎర్లీ బర్డ్ స్కీమ్ పేరిట ఇస్తున్న 5 శాతం రిబేట్‌కు మంగళవారం చివరి తేదీ అని మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తెలిపారు. మంచిర్యాల మున్సిపాలిటీకి పన్ను రూపంలో రూ.16 కోట్లు రావాల్సి ఉండగా, ఎర్లీ బర్డ్ స్కీం కింద రూ. 2.30 కోట్ల పన్నులను ప్రజలు చెల్లించారని, మిగితా వారు మంగళవారం చివరి రోజున పన్ను చెల్లించి, 5 శాతం రాయితీని పొందాలని కోరారు. పట్టణ ప్రజలు ఇంటి పన్నులను మున్సిపల్ కార్యాలయంలోని ఆఫీసు కౌంటర్‌లో గాని, బిల్ కలెక్టర్లకు గాని అందించడం, https://cdma.cgg.gov.in/cdma_arbs/CDMA_PG/PTMenu ఆన్‌లైన్ ద్వారా చెల్లించి, సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణ ప్రారంభం


ఉచిత శిక్షణకు హాజరైన విద్యార్థులు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గ్రీన్‌సిటీ రంగంపేట్‌లో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్(రూబీ) అకాడమీలో సోమవారం ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణను ప్రారంభించారు. క్యాంపును బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరు సుధాకర్ శిక్షణను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఉదయం 7గంటల నుంచి 8:30గంటల వరకు ఉచితంగా బ్యాడ్మింటన్ శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మధు, రూబీ అకాడమీ బాధ్యుడు నరసింహస్వామి పాల్గొన్నారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సీపీఐ న్యూ డెమోక్రసీ కార్యాలయంలో సోమవారం ఐఎఫ్‌టీయూ నాయకులు మే డే పోస్టర్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు బ్రహ్మానందం మాట్లాడుతూ.. చికాగో అమరవీరుల స్ఫూర్తితో కార్మికుల హక్కులను, చట్టాలను కాపాడుకోవడానికి పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు చాంద్‌పాషా, జాఫర్, మంతెన మల్లయ్య, సాంబన్న, సంతోష్, అనిత, అరుణ సాజిద్ పాల్గొన్నారు.

నోటీసులతోనే సరి..?

- మంచిర్యాల మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్‌లో ఇష్టారాజ్యం
- సెట్‌బ్యాక్ లేకుండా.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు
- చర్యలు తీసుకునేందుకు వెనుకడుగు


మంచిర్యాల మార్కెట్‌లో సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపట్టిన భవనాలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో అధిక సంఖ్యలో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రతీ నెలలో పదుల సంఖ్యలో నూతన భవనాలకు అనుమతులు తీసుకుని నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం నూతన భవనాలకు అనుమతులు తీసుకుని, ఆ నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపడుతున్నా, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మంచిర్యాల మార్కెట్ రోడ్డులో మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే సెట్‌బ్యాక్ స్థలాన్ని ఆక్రమించి, పాత భవనం నిర్మాణం చేపట్టగా, దాని పక్కనే నూతనంగా మరో భవనాన్ని సెట్‌బ్యాక్ వదలకుండా నిర్మాణాలు చేస్తున్నా, వాటిని చూసీ చూడనట్లుగా వదిలేస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల నిబంధనలు పాటించని భవనాలపై పలువురు ఫిర్యాదులు చేస్తుండడంతో, కేవలం నోటీసులు ఇచ్చి చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. అధికారులపై ఒత్తిడిని తగ్గించుకునేందుకు షాపులను ఆనుకుని వేసిన తాత్కాలిక షెడ్లను తొలగిస్తున్నారు.

ముమ్మందు కష్టమే...!

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు, మార్కెట్ ఏరియాల్లో నిర్మిస్తున్న భవనాలను నిబంధనలు పాటించకుండానే నిర్మిస్తున్నా, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో, భవిష్యత్‌లో రోడ్లపై వాహనాలు వెళ్లలేని పరిస్థితి తలెత్తే అవకాశం ఉంది. గతంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సుల్లోని సెల్లార్లను సైతం షాపులుగా మార్చేయడంతో, వాహనాల పార్కింగ్‌ను రోడ్డు మధ్యలో చేయాల్సిన పరిస్థితి. కనీసం కొత్తగా నిర్మించే భవనాల సెల్లార్లను పార్కింగ్ కోసమే వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాల్సి ఉన్నా, వాటిని పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం నిర్మిస్తున్న, గతంలో నిర్మించిన భవనాల సెట్‌బ్యాక్ స్థలాన్ని భవన నిర్మాణం పెంచుతూ చేపట్టడం వల్ల రోడ్డుకు ఆనుకునే భవనాలు నిర్మితమవుతున్నాయి. భవిష్యత్‌లో రోడ్డు వెడల్పు చేయలేని పరిస్థితి. సెట్‌బ్యాక్‌ను వదిలేయకుండానే నిర్మించిన భవనాల ముందే, ఇతర చిన్న దుకాణాలు పెట్టించి, వాటి అద్దెను ఆయా దుకాణదారులు వసూలు చేస్తుండగా, రోడ్లు ఇరుకుగా మారి, ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారుతోంది. మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల కళ్ల ముందే నిబంధనలు అతిక్రమిస్తుంటే, కనీస చర్యలు తీసుకోకపోవడంతో, ముమ్మందు మార్కెట్ రోడ్డులో కనీసం నడిచేందుకు వీలులేని పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది.

నోటీసులు ఇచ్చిన వారిపై చర్యలు



ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలు పాటించని భవనాల యజమానులకు నోటీసులు ఇచ్చాం. ఆయా నోటీసులకు వారు స్పందించని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. మున్సిపాలిటీ రోడ్లను, సెట్‌బ్యాక్ స్థలాలను ఇతరులు వ్యాపారం చేసుకునేందుకు వినియోగించకుండా చర్యలు తీసుకుని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తాం. సెట్‌బ్యాక్‌ను వదలకుండా భవన నిర్మాణాలను చేపడితే, మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్

వేసవిలో నిరంతర మంచినీటి సరఫరా

- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాహుల్


నీటి పథకాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఈ వేసవి కాలం పూర్తయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా ఎక్కడా మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా మెరుగైన నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. సోమవారం హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని గోదావరి నదిపై ఉన్న ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్ట్‌తో పాటు మిషన్ భగీరథ ఇంటేక్‌వెల్, నీటి శుద్ధి కేంద్రంను, మంచినీటి వనరులను పర్యవేక్షిస్తూ పరిస్థితి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాహుల్ మాట్లాడుతూ.. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పరిధిలోని పట్టణ, మండల, గ్రామాలకు ఈ వేసవి పూర్తయ్యే వరకు నిరంతరం తాగునీటి సరఫరాకు కార్యాచరణ రూపొందించి నీటి సమస్యలు తలెత్తకుండా చూస్తున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ అందుతున్న తాగునీటి సరఫరా ప్రక్రియపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా, వెంటనే స్పందించి పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకం కింద జిల్లాలో జరుగుతున్న నీటి సరఫరాపై ప్రతీ రోజు నివేదిక అందజేస్తూ, తాజా సమాచారం తెలియజేయాలన్నారు. నీటి వనరులు అందుబాటులో లేని ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు గాను అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పైప్‌లైన్ లీకేజీలు, బోర్‌వెల్ మరమ్మతులు యుద్ధప్రాతిపాదికన పరిష్కరించి నీటి సరఫరాను పునరుద్ధరించేలా త్వరితగతిన చేపట్టాలని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉన్న నేపథ్యంలో మంచినీటి ఎద్దడి ఎదుర్కొనే ప్రభావిత ప్రాంతాలపై కూడా దృష్టి సారించాలని చెప్పారు. వచ్చే మూడు నెలల పాటు ప్రతీ ఇంటికీ నీటిని సరఫరా చేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ మధుసూధన్ పాల్గొన్నారు.

‘బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యం’


కూలీలతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కోటపల్లి: బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ అన్నారు. మండలంలోని కొల్లూర్, బోరంపల్లి, రాంపూర్ గ్రామంలోని ఉపాధిహామీ కూలీలను సోమవారం కలిసి కమలంపువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి నాగేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు రామయ్య, నాయకులు జాడి తిరుపతి, వెంకటనర్సయ్య, బత్తుల సమ్మయ్య, పెద్దింటి లక్ష్మణ్, రాజేందర్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి


ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి తెచ్చిన బీఆర్‌ఎస్ పార్టీతోనే ప్రజలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి అందుతుందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 20వ వార్డులో బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెద్దపల్లి ఎంపీ స్థానానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారని, కారు గుర్తుకు ఓటు వేసి బారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుండా కారు గుర్తుకు ఓటు వేసి, కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు అంకం నరేశ్, గాదె సత్యం, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, గోగుల రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు


చెన్నూర్ విద్యుత్ సబ్ స్టేషన్

- మండు వేసవిలో కరెంట్ కష్టాలు
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు

చెన్నూర్: మండు వేసవిలో కరెంటు కష్టాలు మొదలయ్యాయి. అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండడంతో జనం పరేషాన్ అవుతున్నారు. ఎండల తీవ్రతతో కరెంట్ లేకుండా ఇంట్లో ఉండలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు మాటిమాటికి కరెంట్ కోతలు పెడుతుండడంతో జనం ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కరెంట్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాల్సిన అధికారులు, కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కరెంట్ ఎప్పుడు పోతుంది, ఎప్పుడు వస్తుందనే పరిస్థితి లేకుండా పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వం చెబుతున్నా..

ప్రభుత్వం ఒకపక్క కరెంట్ కోతలు లేవని, నాణ్యమైన కరెంటును సరఫరా చేస్తున్నామని చెప్పుతున్నప్పటికీ చెన్నూర్ మండలంలో మాత్రం స్థానిక విద్యుత్ అధికారులు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా నెలలో మూడు సార్లు విద్యుత్ మరమ్మతుల పేరుతో రోజులో నాలుగు నుంచి ఐదు గంటల కరెంట్ కోతలు విధిస్తున్నారు.

ఎప్పుడు పోతుందో..



ఈ మధ్య కాలంలో కరెంట్ ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. కరెంట్ పోయింది.. ఎప్పుడు వస్తుందనే సమాచారం తెలుసుకుందామంటే చెప్పే నాథుడు లేరు. ఎండలు మండుతున్నాయి. కరెంట్ లేక ఉక్కపోతకు ఉడికి పోతున్నాం. అధికారులు స్పందించి కరెంట్ సరఫరా సక్రమంగా చేయాలి.

– పాకాల సాయికృష్ణ, యువకుడు, చెన్నూర్

ఓవర్ లోడ్ కారణంగా..

వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ పెరిగింది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఏదైనా మరమ్మతుల సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నాం తప్పా, అప్రకటిత కరెంట్ కోతలు విధించడం లేదు. విద్యుత్ సమస్య ఉంటే వెంటనే స్పందిస్తున్నాం. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో చెన్నూర్‌కు మరో సబ్‌స్టేషన్ అవసరం ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పనులు నడుస్తున్నాయి. చిన్నచిన్న కోతలు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తాం.

– శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ, చెన్నూర్

కాంగ్రెస్‌తోనే మెరుగైన పాలన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు


బెల్లంపల్లి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వినోద్


దుగ్నెపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేక్

- చేతి గుర్తుకు ఓటేసి వంశీకృష్ణను గెలిపించాలని ప్రచారం
- ఇంటింటా తిరుగుతూ ఎమ్మెల్యేల వేడుకోలు
- పలు చోట్ల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పార్లమెంట్ ఎన్నికల్లో భారీ విజయం సాధించి కేంద్రంలో అధికారంలోకి వచ్చి సమస్త ప్రజానీకానికి మెరుగైన పాలన అందిస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. హాజీపూర్ మండలంలోని టీకానపల్లి, పెద్దంపేట, దొనబండ, కర్ణమామిడి, పడ్తనపల్లి, హాజీపూర్ గ్రామాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ చేతి గుర్తుకు ఓటు వేసి గడ్డం వంశీకృష్ణను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేపట్టారు. ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికల జోరు

బెల్లంపల్లి/కాసిపేట: కాంగ్రెస్‌లో చేరికలు జోరందుకున్నాయి. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పలు మండలాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల బాధ్యులు, కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బెల్లంపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం గడ్డం వినోద్ కాంగ్రెస్ కండువా కప్పి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలను పార్టీలో చేర్చుకున్నారు. తాండూర్ మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఈసా, ఎంపీటీసీ సభ్యుడు సిరంగి శంకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీ ఎండి జుబేర్‌ల ఆధ్వర్యంలో తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ పూదరి నవీన్, పులగం శ్రీకాంత్, మాడిశెట్టి అజయ్, ఆకుల రవికాంత్ తదితరులు ఇతర పార్టీలకు చెందిన 100 మంది వరకు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కండువా కప్పి ఎమ్మెల్యే వినోద్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాసిపేట మండలం నుంచి బీఆర్‌ఎస్‌కు చెందిన చిన్నధర్మారం, కాసిపేట తాజామాజీ సర్పంచ్‌లు భుక్య సునిత, ధారవత్ దేవి, గుండ్లపహాడ్‌కు చెందిన శంకర్ పలువురు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 14, 15 వార్డులలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పెద్దపెల్లి పార్లమెంట్ అభ్యర్థిగా గడ్డం వంశీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, రఘునాథ్‌రెడ్డి, వొడ్నాల శ్రీనివాస్, గోపతిరాజయ్య, అబ్దుల్‌అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని దుగ్నెపల్లి, సుందరసాల, ముత్తరావుపల్లి, పొక్కూరు, కొమ్మెర గ్రామాల్లో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ సోమవారం ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీని గెలిపించాలని కోరారు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా, వారికి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, నాయకులు మైదం రవి, ముత్యాల బాపాగౌడ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్


విజేతలకు బహుమతి అందిస్తున్న కేవీ ప్రతాప్

భీమారం: మండల కేంద్రంలో పదిరోజులుగా ఉస్కమల్ల చిన్నపోశం స్మారకార్థం ఆయన కుమారులు ఉస్కమల్ల శ్రీనివాస్, పున్నం చందు, శివ నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేవీ ప్రతాప్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ క్రీడల్లో మొదటి బహుమతి పొందిన భీమారం టీంకు రూ.15వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేలు ప్రైజ్‌మనీ, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాడేటి రవి, బుక్యా లక్ష్మణ్, కొత్త సత్తిరెడ్డి పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవు

- అదనపు కలెక్టర్ మోతీలాల్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

భీమారం: కొనుగోలు కేంద్రాల వద్ద వడ్ల బస్తాల తూకంలో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో జరిగిన సంఘటనలను పరిగణలోకి తీసుకొని, ఈ సారి రైతుల వద్ద ఖచ్చితంగా 41కిలోలు మాత్రమే తూకం వేయాలని ఆదేశించినట్లు తెలిపారు. గతంలో ఇష్టానుసారంగా తూకం వేయడంతో తాము తీవ్రంగా నష్టపోయమని రైతులు ఫిర్యాదు చేశారని, ఈ సారి తప్పిదాలు జరగకుండా తాను కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులు కూడా కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారన్నారు. ఈ సారి నుంచి రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే రశీదు ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎవరైనా కొనుగోలు చేసిన ధాన్యానికి రశీదు ఇవ్వకుంటే ఫిర్యాదు చేయాలని ఆయన రైతులను కోరారు. ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత అమ్ముకోవాలని సూచించారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి కేవలం డీఆర్డీఏ ద్వారా జిల్లా వ్యాప్తంగా కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ సారి ఎమ్మెల్యే సిఫారస్‌తో కొనుగోలు కేంద్రాలు కేటాయించినట్లు వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 26117 మెట్రిక్ టన్నుల వరిధాన్యం 3200 మంది రైతుల వద్ద కొనుగోలు చేయగా వాటికిగాను రూ.3.57 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ పాల్గొన్నారు.

గుంతలు పూడ్చరూ..!



చెన్నూర్: మున్సిపాలిటీలో ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారగా అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. రాత్రి వేళల్లో గుంతలు కన్పించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నా, అధికారులు స్పందించడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. చెన్నూర్ నుంచి కోటపల్లి, వేమనపల్లి మండలానికి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చెన్నూర్ పెద్ద చెరువు రావి చెట్టు సమీపంలోని బట్టిగూడెం కాలనీ వెళ్లే రహదారి ఎదురుగా రోడ్డు గుంతమయంగా మారింది. అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డుకు బుంగ పడి ప్రమాదకరంగా ఉంది. లైన్‌గడ్డ నుంచి ఎస్టీ హాస్టల్‌కు వెళ్లే రహదారిలో పెద్ద రంధ్రం ఏర్పడింది. గుంతలుగా ఏర్పడిన రోడ్లను అధికారులు మరమ్మతు చేయడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పదించి మరమ్మతులు చేపించాలని కోరుతున్నారు.



ఘనంగా నృత్య దినోత్సవం

మందమర్రిరూరల్: పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదాన ఆవరణలో అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని కళాకారులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి నృత్య కళా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రాకం సంతోష్ హాజరై కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి హనుమాండ్ల మధు, కొరియోగ్రాఫర్ ఉప్పులేటి నరేష్, కళాకారులు అర్జున్, లక్ష్మణ్, సది, మనోహర్, రమేష్, అశ్విని, సాగర్, ప్రేమ్, స్టాలిన్, తిరుపతి, విజయ్, సాయి, ప్రశాంత్, కళ్యాణ్, రాజు ఉన్నారు.


రామకృష్ణాపూర్: నృత్యం చేస్తున్న చిన్నారులు

రామకృష్ణాపూర్: అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. హిమాన్య కూచిపూడి నాట్య మండలి ఆధ్వర్యంలో నృత్య వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.


మందమర్రిరూరల్: కేక్ కట్ చేస్తున్న కళాకారులు

నృత్యం వలన శరీరానికి ఆరోగ్యం మానసిక ఉల్లాసం లభిస్తుందని అన్నారు. డాన్స్ మాస్టర్స్ సునార్కర్ రాంబాబు, మోహిని, అంజన్ సాయి తదితరులు పాల్గొన్నారు.